# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

సోమవారం 21-8-2023




రోడ్డు ప్రమాదం..

## వలస కార్మికులు మృతి

**నల్లగొండ, ఆగస్ట్ 21(తెలుగుప్రభ):**

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం ఉదయం వేములపల్లి మండలం అన్నపురెడ్డి గూడెం స్టేజి వద్ద మిర్యాలగూడెం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సు టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో అదుపుతప్పిన బస్సు.. బైకును ఢీకొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని మిర్యాలగూడ దవాఖానకు తరలించారు.బస్సు బురద పొలంలో కూరుకుపోయింది. దీంతో ప్రయాణికులు కష్టంగా బయటకు వచ్చారు. క్రేను సహాయంతో బస్సును బయటకు తీశారు. మృతులను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీలుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



లిక్కర్ డ్రాలో

## ‘లక్కీ’లెవరో..!

**హైదరాబాద్, ఆగస్ట్ 21(తెలుగుప్రభ):**

రాష్ట్రవ్యాప్తంగా లిక్కర్‌షాపుల లక్కీడ్రా ప్రక్రియ మొదలైంది. దుకాణాలు దక్కించుకునే అదృష్టవంతులెవరో తెలిసే కార్యక్రమం కొద్దిగంటల్లో పూర్తి కానుంది. అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా 2,620 లిక్కర్ షాపులకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నారు. డ్రాలో ఎంపికైన వారికి రెండేళ్లపాటు లైసెన్సులు మంజూరు చేస్తారు. ఈనెల 4 నుంచి ప్రారంభమైన దరఖాస్తు స్వీకరణ 18వ తేదీతో ముగిసింది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 మద్యం దుకాణాలకు కనీవినీ ఎరుగని రీతిలో దాదాపు 15,894 దరకాస్తులు వచ్చిపడ్డాయి. రంగారెడ్డి జిల్లాలో 234 మద్యం షాపులకు 21,615 దరఖాస్తులు వచ్చాయి. సరూర్‌నగర్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని 134 మద్యం షాపులకు 10,994 దరఖాస్తులు, శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని 100 మద్యం షాపులకు 10,621 దరఖాస్తులు.. ఇలా ఏ జిల్లాలో చూసినా రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,31,493 దరఖాస్తులందాయి.



5 రోజుల శిశువుకు

## 5 వ్యాక్సిన్లు

కేరళలో నర్సు పైశాచికత్వం

**తిరువనంతపురం, ఆగస్ట్ 21:**

ఐదు రోజుల వయసున్న పసికందుకు ఏకంగా ఐదు వ్యాక్సిన్లు ఇచ్చిన నర్సు నిర్వాకం ఇది.ఈ దారుణ ఘటన కేరళలో జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నర్సు నిర్వాకంతో చిన్నారి ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతోంది. పాలక్కాడ్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శిశువు తల్లిదండ్రులు చిన్నారికి బీసీజీ టీకా(వ్యాక్సిన్) వేయించేందుకు స్థానికంగా ఉన్న ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ వైద్యుడితో ప్రిస్క్రిప్షన్ రాయించుకుని, దాన్ని అక్కడి నర్సు చారులతకు చూపించారు. బిడ్డకు బీసీజీ టీకాకోసం వచ్చామని చెప్పడంతో నర్సు అకారణంగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తరువాత బిడ్డకు తొలుత ఎడమ భుజంపై బీసీజీ టీకా ఇచ్చింది. అక్కడితో ఆగకుండా బిడ్డ తొడలపై మరో రెండు రకాల టీకాలు, ఆ తరువాత నోట్లో చుక్కలమందు వేసింది. అనుమానం వచ్చిన శిశువు తల్లిదండ్రులు వెంటనే డాక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ నర్సు బిడ్డకు బీసీజీతో పాటూ పెంటావేలెంట్ పోలియో టీకా, న్యూమోకొక్కల్ టీకా, నోటి ద్వారా తీసుకునే పోలియో టీకాతో పాటు రోటావైరస్ టీకా వేసినట్టు తేలింది. దాంతో అధికారులు నిందితురాలిని సస్పెండ్ చేశారు. ఘటనపై జిల్లా మెడికల్ ఆఫీసర్ దర్యాప్తు చేపట్టారు. ఒకేసారి అయిదు టీకాలు తీసుకోవడంతో అనారోగ్యం పాలైన చిన్నారికి పాలక్కాడ్ జిల్లా ఆసుపత్రిలో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్టు పేర్కొన్నారు.




# ఎవరిని నమ్మాలి

ఆలోచిస్తున్న ప్రజలు

మాటల కన్నా.. చేతలకే ప్రాధాన్యం

**తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయపార్టీలు హామీల గాలాలతో ప్రజలకు ఎర వేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఒకరు ఒకటంటే మరొకరు రెండనేందుకు సిద్ధమవుతున్నాయి. నాలుగనేందుకు కూడా వెనుకాడటం లేవు. ఈ పరిస్థితుల్లో ప్రజలు కేవలం మాటలెవరివి.. అమలు చేసేచేతలెవరివి అనే ఆలోచనల్లో పడ్డారు.**

**హైదరాబాద్, ఆగస్ట్21 (తెలుగుప్రభ):**

గాలిమాటలు చెప్పే వారి వలలో చిక్కి బోల్తాపడరాదనే ఎరుకతో చాలామంది ఉండటం విశేషం. బీఆర్ఎస్ నేతలు చెప్పినట్లుగానే యాభయ్యేళ్లకు పైగా అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయని వారు ఇప్పుడు అన్నీ చేస్తామంటే నమ్మడం లేరు. వివిధరకాల వర్గాలకు ఆసరాగా నిలిచే పెన్షన్లనే తీసుకుంటే దశాబ్దాలు గడిచినా, మార్కెట్‌లో ధరల మంటలు ఆకాశానికెగిసినా యాభైలు, వందలను మించి పెన్షన్లను కనీసం వేయి రూపాయలు చేయలేకపోయినవారు ఇప్పుడు వేనవేల మాటలు చెబుతుండటాన్ని చూసి ప్రజలు ఔరా! అనుకుంటున్నారు. ఇదే సందర్భంలో గత జీహెచ్ఎంసీ ఎన్నికల సమయాన వరదలు రావడంతో అధికారపార్టీ పదివేల సాయమందిస్తే.. అది చాలదన్న వాళ్లు తమ పార్టీ కార్పొరేటర్లు గెలిచిన వార్డుల్లో ఏం చేశారని ప్రజలే ప్రశ్నిస్తున్నారు.కారు పోతే కాదు.. బైక్ పోతే బైక్ అన్న ‘బండి’ మాటల్లోని విశ్వసనీయతను బేరీజు వేసుకుంటున్నారు.

### చేతలు కావాలి

ఇదే సమయాన బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వికలాంగుల పెన్షన్ రూ.4016కు, ఇతర వర్గాల వారి పెన్షన్ రూ.2016కు పెంచడమే కాకుండా నెలనెలా ఠంచనుగా వారి బ్యాంకు ఖాతాల్లో పడుతుండటాన్ని ప్రస్తావిస్తున్నారు. జీతమిచ్చినట్లు ఇస్తున్న ప్రభుత్వాన్ని నమ్ముదామా లేక మాటలు తప్ప చేతలు చేయని వారి చేతిలో మోసపోదామా అని ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్‌పార్టీ అందరి పెన్షన్ రూ.4వేలకు పెంచుతామని చెబుతోంది. మాటలే కదా అనుకుంటే సీఎం కేసీఆర్ రూ.5వేలో, 6వేలో అనేవారు. కానీ.. ఎంతో కొంత పెంచుతామని సూర్యాపేట బహిరంగ సభలో ప్రకటించారు. అంటేరాష్ట్ర ఖజానా, రాష్ట్రంలోని ఆసరా పెన్షన్‌దారుల సంఖ్య, వారికి నెలనెలా ఎంత చెల్లించాల్సి వస్తుంది.. తదితరమైనవన్నీ ఆలోచించి, అమలు చేసేందుకు ఇచ్చిన వాగ్దానమది. ప్రజలు కూడా దీన్నే విశ్వసిస్తున్నారు తప్ప కాంగ్రెస్ పదివేలిస్తామన్నా నమ్మే పరిస్థితిలో లేరు. ఎందుకంటే ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా అమలు కావడం లేదు. అలాంటిది ఇక్కడ ఆచరిస్తారనుకోవడం మోసపోవడమే అవుతుంది అంటూ రిటైరైన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడొకరు వ్యాఖ్యానించారు.


### రూ 1000 పెంచితే రూ.అదనంగా రూ.450 కోట్లు

ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఉత్తి హామీని మాత్రమే ఇవ్వలేదు. ఎంత పెంచితే ఏడాదికి ఎంత మొత్తం అధికంఅవుతుందో లెక్క వేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వికలాంగులు కాక ఇతర ఆసరా పెన్షనర్లకు ప్రస్తుతం రూ.2016 ఇస్తున్నారు. దీన్ని రూ.3016కు పెంచితే రాష్ట్ర ఖజానాపై దాదాపు రూ.450 కోట్ల అదనపు భారం పడనుందని ఆర్థికశాఖ అంచనా వేసింది.ప్రస్తుతం ఈ పెన్షన్లు పొందుతున్న వారు 44.82 లక్షల మంది ఉన్నారు. ఏటా దాదాపు రూ.11,628 కోట్లు చెల్లిస్తున్నారు. పెన్షన్ పెంచితే రూ.12వేల కోట్లకు పైగా అవసరమవుతుంది. ఇవన్నీ ఆలోచిస్తున్నారంటే అమలు చేసే చిత్తశుద్ధి ఉన్న వారి చేతలకు నిదర్శనం.

లద్దాఖ్ ప్రమాద జవాన్లలో

## రంగారెడ్డి జిల్లా వాసి

**హైదరాబాద్, ఆగస్ట్21(తెలుగుప్రభ)**




లద్దాఖ్‌లోని లేహ్‌జిల్లాలో వాహనం లోయలో పడి మరణించిన మృతుల్లో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తిర్మన్‌దేవునిపల్లికి చెందిన చంద్రశేఖర్(30) ఉండటంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నిరుపేద బీసీ కుటుంబానికి చెందిన చంద్రశేఖర్ కొందుర్గులోని బీసీ సంక్షేమ హాస్టల్ ఉంటూ పదో తరగతి వరకు చదివాడు. అనంతరం 2011లో సైన్యంలో చేరారు. విధినిర్వహణలో భాగంగా తోటి జవాన్లతో కలిసి ప్రయాణిస్తున్న వాహనం లోయలో పడింది. మృతుల్లో చంద్రశేఖర్ కూడా ఉన్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. జవాన్‌మృతితో గ్రామం విషాదంలో మునిగింది. ఈసారి వచ్చినప్పుడు కొడుకును బడిలో చే రుస్తానని వెళ్లినవాడు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంపై భార్య లాస్యను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

ఎన్‌కౌంటర్‌లో

## ముగ్గురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్, ఆగస్ట్21:**




జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా పరిగాం గ్రామంలో నిన్న భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో లష్కరే తోయిబా టాప్ కమాండర్‌తో పాటు మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల సంచారంపై ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందడంతో భద్రతా బలగాలు అక్కడకు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులు ఎదురుపడి కాల్పులు జరిపాయి. భద్రతా దళాల ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు చనిపోయారు.

## ఆన్‌లైన్ పరీక్ష..ఆలస్యం

పీజీటీ గురుకుల పరీక్షకు సాంకేతిక సమస్యలు

**హైదరాబాద్, ఆగస్ట్ 21(తెలుగుప్రభ):**

ఇవాళ ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కావాల్సిన పీజీటీ గురుకుల ఉద్యోగ పరీక్షకు ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో చాలా ఆలస్యంగా 10.30గంటలకు మొదలైంది. వాస్తవానికి 8.30 గంటలకు ప్రారంభం అయి, 10.30 గంటలకు ముగియాల్సి ఉండగా, సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైనట్లు పరీక్షా కేంద్రాల నిర్వాహకులు పేర్కొన్నారు. దీంతో నగరంలోని హయత్‌నగర్ పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు ఆందోళనకు దిగడంతో రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.







## ‘ఇండియా’ లోగో రెడీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21(తెలుగుప్రభ):**

ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) లోగో సిద్ధమైంది. తదుపరి సమావేశంలోనే విడుదల చేసేందుకు కూటమి నేతలు సన్నాహాలు చేస్తున్నారు. కూటమి వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు, తదుపరి ముంబై మహానగరంలో జరగబోయే సమావేశంలో ‘లోగో’ ఆవిష్కరించేందుకు చకాచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ముంబైలో విపక్ష కూటమి సమావేశం కానుంది. ఇప్పటికే రెండు సమావేశాలు ముగిసాయి. మొదటి సమావేశం జనతాదళ్ (యునైటెడ్) అధినేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, రాష్ట్రీయ జనతా దళ్ (యునైటెడ్ ) నేత, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సంయుక్తంగా బిహార్ రాజధాని నగరం పాట్నాలో విపక్ష కూటమి తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. కాంగ్రెస్ సారథ్యంలో రెండో సమావేశం బెంగళూరులో జరిగింది. బెంగళూరు సమావేశంలో కూటమి ‘ఇండియా’ గా నామకరణం జరిగింది. ముంబైలో జరగనున్న మూడో సమావేశానికి శివసేన (ఉద్ధవ్ బాల్ థాక్రే) వర్గం అధినేత, మాజీ సీఎం ఉద్ధవ్ థాక్రే ఆతిథ్యమిస్తున్నారు.